క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తాళ్లపూడి: ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన గజ్జరం గ్రామానికి చెందిన వేములూరి భాగ్యం కుటుంబానికి దాతల సహకారంతో సోమవారం ఆర్థిక సహాయం చేశారు. మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు తన స్నేహితుల ద్వారా సేకరించిన రూ.5 వేల నగదు సాయాన్ని సర్పంచ్ గండి రాంబాబు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండమూడి శేషగిరిరావు, పండు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా బాధిత వేములూరి భాగ్యం కుటుంబానికి మానవత సంస్థ మండల శాఖ ద్వారా అధ్యక్షుడు అంకెం సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం వంటపాత్రలు అందజేశారు.

నూతన అధ్యక్షుడిగా బాలస్వామి ఎంపిక



ఫాదర్స్‌తో నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బ్రదర్ బాలస్వామి

నిడదవోలు: స్థానిక సెయింట్ అంబ్రోస్ పారిష్ చర్చిలో సోమవారం దివ్య బలిపూజ నిర్వహించారు. పునీత విన్సెంట్ డి పాల్ సంఘం సెంట్రల్ కౌన్సిల్ అఫ్ ఏలూరు శాఖ నూతన అధ్యక్షుడిగా బ్రదర్ తాతపూడి బాలస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు ఫాదర్స్ ఆధ్వర్యంలో బాలస్వామి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఏలూరు సీసీ బాధ్యతలను నూతన అధ్యక్షుడు బాలస్వామికి అప్పగించారు. కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ టి. ఇమ్మానియేలు, ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ విజయకుమార్, రెవరెండ్ ఫాదర్ జోసెఫ్ అర్జున, రెవరెండ్ ఫాదర్ జాన్ పీటర్, బ్రదర్ బాలకిషోర్, బ్రదర్ రామారావు, నేషనల్ కౌన్సిల్ అఫ్ ఇండియా సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది ధర్నా

నిడదవోలు: తమ డిమాండ్ల సాధనకు మున్సిపల్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది నిడదవోలు మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఏపీ మున్సిపల్ కార్మికుల యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపు మేరకు వారీ ధర్నా నిర్వహించారు. బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలని, గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.ధర్నాలో తూరుగోపు నాగేశ్వరరావు, బొత్స దుర్గాప్రసాద్, తొత్స ముద్దకృష్ణ, బండారు రాంబాబు, కారింకి వెంకటేష్, చొలిశెట్టి నాగేశ్వరరావు, బండారు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

12న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నిడదవోలు: ఈనెల 12వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు విద్యుత్ వినియోగదారుల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.నారాయణ అప్పారావు సోమవారం తెలిపారు. నిడదవోలులోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ, విద్యుత్ సాంకేతిక సభ్యులు ఎస్.మసిలమణి హాజరు కానున్నారని ఆయన తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసి వాటిని పరిష్కరించుకోవాలని నారాయణ అప్పారావు సూచించారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



గొడుగులు అందజేస్తున్న లయన్ రంగా వెంకటేశ్వరరావు, రోటరీ సభ్యులు

నిడదవోలు: పుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకునే వారికి అండగా నిలవడం అభినందనీయమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేవీ రత్నకుమార్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో లయన్స్ జిల్లా సేవా కో–ఆర్డినేటర్ రంగా వెంకటేశ్వరరావు రూ.15 వేల విలువైన గొడుగులను సోమవారం 15 మంది చిరు వ్యాపారులకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కేవీ రత్నకుమార్, కార్యదర్శి ఎ. కృష్ణచైతన్య, కోశాధికారి కేఎస్‌వీ సత్యనారాయణ, సానేపు సుబ్బారావు, ఎం. మూర్తిరాజు, చిక్కాల రాజా తదితరులు పాల్గొన్నారు.

కాపవరంలో సోనియా పుట్టిన రోజు వేడుక

కొవ్వూరు: యూపీఏ మాజీ చైర్ పర్సన్, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఎండీ ఫసీఉల్లా బేగ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల మధ్య కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అనంతరం సోనియా గాంధీ ఆరోగ్యం బాగుండాలని కోరుతూ పార్టీ నాయకులు సాకా పుల్లారావు ఇతర నాయకులు దేవుని ప్రార్థించారు.

ఉచిత గ్యాస్ ఉత్తిదేనా..!

- 'దీపం–2' పథకం నిర్వహణపై మహిళల కన్నెర్ర
- బ్యాంకు ఖాతాలకు 10 రోజులైనా జమ కాని గ్యాస్ సొమ్ము



నిడదవోలు మండలం సూరాపురంలో హెచ్‌పీ గ్యాస్ గోడౌన్



గ్యాస్ సిలిండర్‌లు

నిడదవోలు రూరల్: కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన దీపం–2 పథకం నిబంధనలపై మహిళలు కన్నెర్ర చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ పొందిన 48 గంటల తర్వాత కూడా రకరకాల సాకులతో అర్హుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ కాకపోవడమే మహిళల అసంతృప్తికి కారణం. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి మొండి చేయి చూపేందుకు, గతంలో మాదిరిగా అర్హులకు మేలు జరగకుండా ప్రభుత్వం మోకాలు అడ్డుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయని ఆరోపిస్తున్నారు.

79 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు

నిడదవోలులోని నాలుగు హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలకు సంబంధించి నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి, చాగల్లు, కొవ్వూరు మండలాల పరిధిలో 79 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అర్హులైన గ్యాస్ వినియోగదారులు వంట గ్యాస్ బుక్ చేసుకున్నాక, సొమ్ము చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకుంటున్నారు. వారిలో చాలా మంది అర్హుల బ్యాంకు ఖాతాలకు ఎన్నిరోజులైనప్పటికీ ప్రభుత్వ రాయితీ సొమ్ము జమ కావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కొంతమంది లబ్ధిదారులు గ్యాస్ నిర్వాహకులను అడుగుతున్నారు. తాము సిలిండర్ డెలివరీ చేసిన వెంటనే ఆన్‌లైన్ చేశామని నిర్వాహకుల నుంచి సమాధానం వస్తోంది. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ కనెక్షన్లు కావడంతో తొలివిడతలో మార్చి నెలవరకూ సమయం ఉందని, అప్పటిలోగా రాయితీ సొమ్ము జమ అవుతుందని గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సమాధానం ఇస్తున్నారు.

చంద్రబాబు ఎన్నికల హామీ ఇదీ..

ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చేటపుడు కేవలం తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఆ హామీలో 48 గంటల్లోగా లబ్ధి చేకూరుస్తానని ఎక్కడా ఆయన ప్రస్తావించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత గ్యాస్ పంపిణీపై కొత్త నిబంధనలు పెట్టినట్టు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ 48 గంటలు అనే మాట ఇప్పుడు అంటున్నారు తప్ప.. గతంలో చెప్పలేదని వారు విమర్శిస్తున్నారు. ముందుగా డబ్బు చెల్లించాలనేది కొత్త నిబంధనే. ఆ హామీ మేరకైనా 48 గంటలు కాదు కదా.. 10 రోజులకైనా సొమ్ము చెల్లించి గ్యాస్ పొందిన అర్హులకు బ్యాంకు ఖాతాల్లో రాయితీ సొమ్ము జమ కావడం లేదు. ఇదేమిటని గ్యాస్ ఏజెన్సీలను అడిగితే ఈకేవైసీ చేయించుకోవాలని, ఫోను నంబర్ మార్చుకోవాలని, రకరాల సాకులు చెబుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

అన్నీ అబద్ధపు హామీలే..



చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలే. అందులో ఉచిత గ్యాస్ పంపిణీ ఒకటి. హామీ ఇచ్చినపుడు తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాకా ముందు డబ్బులు చెల్లించమంటున్నారు. నగదు చెల్లించాక 48 గంటల్లో జమ చేస్తామని చెప్పారు. ఇప్పుడేమో రెండు వారాలైనా డబ్బులు బ్యాంకు ఖాతాలో జమకాలేదు.

–డి.నాగప్రసాద్, సమిశ్రగూడెం

ఈ–కేవైసీ తప్పనిసరి



నగదు చెల్లించి గ్యాస్ సిలిండర్ పొందిన వారిలో అర్హులందరూ తప్పనిసరిగా ఈ– కేవైసీ చేయించుకోవాలి. అప్పుడే వారికి గ్యాస్ సిలిండర్ తీసుకున్న తర్వాత సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. బ్యాంక్ అకౌంట్‌తో పాటు పాన్, ఆధార్ కార్డులతో సంబంధిత గ్యాస్ ఏజెన్సీలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలి. గ్యాస్ సరఫరాలో ఏమైనా ఇబ్బందులుంటే మాకు ఫిర్యాదు చేస్తే వెంటనే తగు చర్యలు తీసుకుంటాం.

–ఎం.అనిల్‌కుమార్, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్, నిడదవోలు

దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా శివ



ర్యాలి శివకు నియామక పత్రం అందిస్తున్న పోసికుమార్

నిడదవోలు: పట్టణంలోని జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు ర్యాలి శివ అఖిల భారత దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యాడు. ధవళేశ్వరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అఖిల భారత దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి ముత్యాల పోసికుమార్ చేతుల మీదగా ర్యాలి శివ ఈ మేరకు నిమామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో అఖిల భారత వికలాంగ హక్కుల జాతీయ వేదిక ప్రధాన కార్యదర్శి ఖండవల్లి భరత్ కుమార్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు, జిల్లా అధ్యక్షుడు కండెల్లి రజినికుమార్, జ్యోతిర్మయి దివ్యాగుల సంక్షేమ సంఘ కార్యదర్శి వంగా కృపానందప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ గోపిమూర్తికి రిటైర్డ్ ఉద్యోగుల అభినందనలు

నల్లజర్ల: టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొర్రా గోపి మూర్తి విజయం సాధించడం ఉపాధ్యాయుల ఆత్మగౌరవం ఇనుమడించిందని రిటైర్డు ఉద్యోగుల సంఘ మండలశాఖ అధ్యక్షుడు ఐవీ సత్యం అన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు కార్పొరేట్ వ్యక్తి కొమ్ము కాసినా ఉపాధ్యాయులు విజ్ఞతతో వ్యవహరించి ఉద్యమ అభ్యర్థి గోపి మూర్తిని 3,806 ఓట్ల ఆధిక్యతతో గెలిపించడం అభినందనీయమన్నారు.

అర్జీలు మండలాల్లో అందించండి

పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో రాణి సుస్మిత



కొవ్వూరు పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ఫిర్యాదులను ప్రతి తహసీల్దార్ కార్యాలయంలోనూ అందజేయాలని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ మీకోసంలో ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం నాటి మీకోసంలో ఐదు అర్జీలు అందినట్టు ఆర్డీవో తెలిపారు. పెరవలి మండలం కాకరపర్రుకు చెందిన బండి ధర్మారావు అనే వ్యక్తి ఆర్ అండ్ బీ స్థలంలో పూల వ్యాపారం పెట్టుకుని జీవిస్తున్నారు. ఆపక్క పొలాన్ని కొనుగోలు చేసిన పెనుమత్స సుబ్రహ్మణ్యరాజు అనే వ్యక్తి తనను ఖాళీ చేయాలంటున్నారని ధర్మారావు పేర్కొన్నారు. ఉపాధి నిమిత్తం తనకు ప్రత్యామ్నాయ స్థలం చూపించాలని ధర్మారావు కోరారు. తన ఇంటి ప్రహరీ నిర్మాణానికి వీలుగా స్థలాన్ని సర్వే చేయించి అనుమతి ఇప్పించాలని మండలంలోని కాపవరానికి చెందిన కొడమంచిలి సుభాషిణి కోరారు. డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని పట్టణంలోని శ్రీనివాసపురానికి చెందిన తాళ్లూరి రామచంద్రరావు కోరారు. దేవరపల్లి మండలం యాదవోలుకు చెందిన కోలా శ్రీనివాస్ అనే వ్యక్తి తనకు ఆర్ఎస్ నంబర్ 414–6లో 0.45 ఎకరాల పొలం ఉంటే రికార్డుల్లో మాత్రం 0.31 ఎకరాలుగా నమోదు చేశారని, దీన్ని సరి చేయించాలని కోరారు. ఆర్పీగా పని చేస్తున్న తనను తొలగిస్తామంటూ బాధిస్తున్నారని పట్టణంలోని గౌతమీనగర్‌కి చెందిన ఐవీజే శ్రీలక్ష్మి ఫిర్యాదు చేశారు.

పెరవలిలో ఐదు అర్జీలు

పెరవలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఐదు అర్జీలు అందాయని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి తెలిపారు. పంట భూములను ఆన్‌లైన్ చేయాలని రెండు అర్జీలు, సిమెంటు రోడ్డు నిర్మాణం, ఆక్రమణల గురించి రెండు అర్జీలు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదులను ఆయా శాఖలకు తరలించామన్నారు.

ఇకపై సాఫీగా తాగునీటి సరఫరా

జాక్ వెల్ వద్ద పూడుకుపోయిన మట్టి తొలగింపు



తాళ్లపూడిలో గోదావరి వద్ద జాక్‌వెల్ పూడిక తొలగింపు పనులు

తాళ్లపూడి: తాగునీటి సరఫరాలో మండల ప్రజలకు తరచూ ఎదురవుతున్న అవాంతరాలు తొలగిపోయాయి. ఇందుకవసరమైన పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పూర్తి చేశారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద 2016లో ఏర్పాటు చేసిన సమగ్ర తాగునీటి సరఫరా పథకం ద్వారా శుద్ధి చేసిన గోదావరి జలాలను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకూ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. గోదావరి నది వద్ద ఈ పథకానికి చెందిన జాక్ వెల్ మట్టితో పూడుకుపోయింది. పేరుకు పోయిన మట్టి తొలగింపు పనులను సోమవారం పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షేక్ సూర్జహాన్ మాట్లాడుతూ తాగునీటి పంపిణీకి ఇటీవల తరచూ వచ్చే అడ్డంకులు, సాంకేతిక ఇబ్బందులు ఇక తొలగినట్టే అన్నారు. రూ.2.50 లక్షల వ్యయంతో ఈ పనులను పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. ఈ పనులను డీఈ ఎం.అప్పారావు పర్యవేక్షణలో పూర్తి చేశామని సూర్జహాన్ వివరించారు.

నిరుపయోగంగా రైతు బజారు షెడ్లు



గోపాలపురం మార్కెట్ యార్డులో నిర్మించిన రైతు బజారు షెడ్లు



దేవరపల్లిలోని రైతు బజారు షెడ్లు

- గోపాలపురం, దేవరపల్లిలో మార్కెట్ యార్డు నిధులతో నిర్మాణం
- ఆరేళ్లుగా ఖాళీగా ఉన్న వైనం

దేవరపల్లి: గోపాలపురం మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించిన రైతు బజారు షెడ్లు దాదాపు ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. 2017–18 లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముళ్లపూడి వెంకట్రావు ఆధ్వర్యంలో గోపాలపురం, దేవరపల్లిలో రైతు బజారు షెడ్లు నిర్మించి, రైతు బజార్లు ప్రారంభించారు. గోపాలపురం మార్కెట్ యార్డులో రూ.8.50 లక్షలు, దేవరపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని రెవెన్యూ స్థలంలో రూ.10 లక్షల వ్యయంతో షెడ్లు నిర్మించారు. తక్కువ ధరకు ప్రజలకు కూరగాయలు అందించాలనే ఉద్దేశంతో రైతు బజార్లు ఏర్పాటు చేసి పలువురు రైతులకు షెడ్లు అప్పగించారు. 2017లో గోపాలపురంలోను, 2018లో దేవరపల్లిలో రైతు బజార్లు ప్రారంభించారు. కొద్ది రోజులు రైతులు రైతు బజార్లలో కూరగాయల విక్రయాలు నిర్వహించారు. రైతు బజార్లలో కొనుగోళ్లు లేకపోవడంతో రైతులకు పెట్టుబడులు రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు రైతు బజార్లను విడిచి పెట్టారు. అప్పటి నుంచి రైతు బజార్ల షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. మార్కెట్ కమిటీ నిధులు రూ. 18.50 వ్యయంతో రైతు బజార్లను ఏర్పాటు చేసిన అప్పటి పాలకులు వాటి నిర్వహణ గురించి పట్టించుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: కోర్టు పరిధిలో పారా లీగల్ వలంటీర్లు (న్యాయ సహాయకులు)గా పని చేసేందుకు మండలం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సోమవారం తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తుదారులు కనీసం పదో తరగతి పాసై ఉండాలన్నారు. రిటైర్డు టీచర్స్, లెక్చరర్స్, సీనియర్ సిటిజన్స్, సోషల్ వర్కర్స్, స్టూడెంట్స్, డ్వాక్రా మహిళలు పారా లీగల్ వలంటీర్ల పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తి ఉన్న వారు తమ బయోడేటాను, విద్యార్హతల జిరాక్స్ కాపీలను దరఖాస్తుతో పాటు జత చేయాలన్నారు.దరఖాస్తులను కొవ్వూరు కోర్టులో మండల లీగల్ సర్వీస్ కమిటీకి అందజేయాలని సూచించారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి తోడ్పడండి

కొవ్వూరు: ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా ఎక్కువ మంది కేసులు పరిష్కరించుకొనేలా న్యాయవాదులు, పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. పట్టణంలోని కోర్టు హాలులో సోమవారం ఆమె న్యాయవాదులు, పోలీసు అధికారులతో పాటు డీఎల్ఎస్ఏ సెక్రటరీ కె.రత్నప్రసాద్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రత్నప్రసాద్ మాట్లాడుతూ పోలీసు స్టేషన్ వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, ఎన్ని కేసులు రాజీ కుదుర్చే అవకాశం ఉందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పలువురికి వనిత, గూడూరి శ్రీనివాస్ పరామర్శ



పోచవరంలో కాకర్ల లక్ష్మి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న డాక్టర్ గూడూరి, తానేటి వనిత తదితరులు

తాళ్లపూడి: పోచవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావును సోమవారం ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ హోం మంత్రి తానేటి వనిత, ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ తదితరులు పరామర్శించారు. కాకర్ల వెంకటేశ్వరరావు తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారందరూ లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వల్లభశెట్టి శ్రీనివాస్, మండిగ గిరి, అన్నవరం, వీరవెంకట సత్యనారాయణ, విత్తం నాని తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల మండలంలో..

నల్లజర్ల: మండలంలోని సింగరాజుపాలెం ఎంపీటీసీ మాజీ సభ్యులు వామిశెట్టి జయలక్ష్మి, దొండపాటి సరయ్య ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొఠారు సత్యనారాయణ చౌదిరి అత్తగారు పాకలపాటి పారమ్మ, కంచర్ల కృష్ణమూర్తి కూడా మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను సోమవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే మంత్రి తానేటి వనిత పరామర్శించారు. ఆమెతో పాటు పరామర్శించిన వారిలో సింగరాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి, పరమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అలాగే పోతవరంలో ఇటీవల మరణించిన మణ్యం భార్గవతేజ, రిటైర్డు టీచరు కొండాబత్తుల శామ్యూల్ కుటుంబ సభ్యులను కూడా తానేటి వనిత పరామర్శించారు.

అనంతపల్లిలో..

అనంతపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త వెలగాన దుర్గారావు ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. సోమవారం అతని ఇంటికి తానేటి వనిత వెళ్లి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన వంతు సాయంగా రూ.10 వేలు అందజేశారు.

అచ్చిబాబు కుటుంబానికి..

గోపాలపురం: దొండపూడి సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబును సోమవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత, ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పరామర్శించారు. అచ్చబాబు తండ్రి చంటియ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.

చౌటుపల్లి వీరన్నకు..

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్నను ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పరామర్శించారు. ఇటీవల వీరన్న తండ్రి దుగ్గిరాజు మృతి చెందారు. ఈ మేరకు ఐ.పంగిడిలోని వీరన్న స్వగృహానికి గూడూరి శ్రీనివాస్ వెళ్లి ఆయనను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని, ఆయన కుటుంబ సభ్యులను ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు తోట రామకృష్ణ, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తదితరులు వీరన్నను పరామర్శించిన వారిలో ఉన్నారు.

బీమా ప్రీమియం రైతులే చెల్లించుకోవాలి

నల్లజర్ల: పీఎం పసల్ బీమా యోజనకు జిల్లా నుంచి దిగుబడి బేస్‌గా వరి,మొక్కజొన్న పంటలను నిర్దేశించినట్టు ఏవో కె.కమల్‌రాజ్ తెలిపారు. ఈ రెండు పంటలు పండించే రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియం ఈనెల 31వ తేదీ లోగా చెల్లించి నమోదు చేయించుకోవాలన్నారు. మొక్కజొన్నకు ఎకరానికి రూ.540, వరి పంటకు ఎకరానికి రూ.630 చొప్పున ప్రీమియంగా చెల్లించాలన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ లేదా గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రంలో సంప్రదించి ఈ ప్రీమియం సొమ్ము చెల్లించాలన్నారు. రైతు ఆధార్ కార్డు, వన్ బీ, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నంబరు వివరాలు అందించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకుల్లో రుణ సహాయం పొందే సమయంలోనైనా ఈ ఇన్సూరెన్స్ చెల్లించవచ్చన్నారు.

మూగ జీవాలకు అందని వైద్యం

- మూడు నెలలుగా భర్తీకాని వెటర్నరీ ఏడీ పోస్టు
- నిలిచిపోయిన మందుల సరఫరా



నల్లజర్ల పశు వైద్యశాలలో వైద్యసేవలు (ఫైల్)

నల్లజర్ల: మూగజీవాలే కదా బతికినా..చచ్చినా ప్రశ్నించేవారెవరు? అనే రీతిలో ఉంది నల్లజర్ల పశువైద్యశాల తీరు. కొంత కాలం క్రితం నల్లజర్ల పశువైద్యశాలను అప్‌గ్రేడ్ చేసి అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) స్థాయి డాక్టర్‌ను నియమించారు. ఇక్కడ పనిచేసే డాక్టర్ మూడు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. గోపాలపురం పశువైద్యుడు ధరణిబాబును నల్లజర్లకు ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఇక్కడ ఏదైనా అత్యవసరమైతే దాదాపు 30 కిలోమీటర్ల దూరం నుంచి ధరణిబాబు ఇక్కడకు వచ్చి వైద్య సేవలు అందించాలి. ఆయన వచ్చి ఆ పశువుకు వైద్యం అందించేలోగా అది ఉంటుందో, ప్రాణాలు విడుస్తుందో తెలియని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో నల్లజర్ల పశువుల ఆసుపత్రులోని సహాయకులే వైద్యుల అవతారం ఎత్తుతున్నారు. ఇక మండలంలోని పోతవరం, తూర్పుచోడవరం వెటర్నరీ డిస్పెన్సరీలకు సహాయకులు కూడా లేరు. కూటమి ప్రభుత్వం వచ్చాక మందులు అందించిన దాఖలాలు లేవు. గతంలో ఒక్కో డిస్పెన్సరీకి మూడు నెలలకు ఒకసారి రూ.3 లక్షల విలువైన మందులు సరఫరా చేసేవారు. నల్లజర్ల ప్రధాన ఆసుపత్రికి రూ.2 లక్షల విలువైన మందులు ఇచ్చేవారు. అత్యవసర చికిత్స నిమిత్తం ఉపయోగించే యాంటీ బయోటిక్స్,పెయిన్ కిల్లర్స్, పశువులు బాగా మేతమేయడానికి వాడే మందులు, కాల్షియం, ఎముకలపొడి వంటి దాదాపు 200 రకాల మందులు నేటివరకూ ప్రభుత్వ వైద్యశాలలకు అందలేదు. అందుబాటులో ఉన్న అరకొర మందులతో నెట్టుకొస్తున్నారు. మిగతా అన్నింటినీ బయట మందుల షాపులలో పశువుల యజమానులే కొనుగోలు చేసి తీసుకు వస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మందుల ఇండెంట్ పెట్టేందుకు జిల్లా స్థాయిలో ఓ కమిటీ ఉండేది. పశువైద్యులు, ఏడీఏలు ఎవరికి వారు తమ పరిధిలో ఆన్‌లైన్‌లో పశువులు, మేకలు, గొర్రెలకు ఆన్‌లైన్‌లో ఇండెంట్ పెట్టే అవకాశం ఉండేది. ప్రతి మూడు నెలలకూ ఒకసారి కచ్చితంగా పశువైద్యశాలలకు, రైతు భరోసా కేంద్రాలకు మందులు సరఫరా చేసేవారు. ఇపుడు అటువంటి పరిస్థితి లేదు. మందుల కోసం వైద్యులు ప్రతిపాదనలు పంపి ఆరునెలలైంది. ఇప్పటి వరకూ సరఫరా కాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పశుసంచార వాహనాలపై ఉన్న వైఎస్సార్ ఫొటో, పేర్లను తొలగించడంలో ఉన్న శ్రద్ధ, మూగజీవాలకు వైద్యం అందించడంపైన, వాటి సంరక్షణపైన దృష్టి సారించడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.